


చిత్తూరు డీఐ రోడ్డులో రుద్రుడిగా.. - పుంగనూరు ఎన్ఎస్‌పేటలో ఆదిశక్తి అలంకరణ - కుప్పం పట్టణం ప్యాలెస్ ప్రాంతంలో బాల గణపతి - పుంగనూరులో రథంపై విష్ణుమూర్తిగా వినాయకుడు - చిత్తూరు మంగసముద్రంలో విశ్వరూప అలంకారం - పలమనేరులో గజవాహనంపై రాజసంగా..

వివిధ రూప.. వినాయక

జిల్లాలో శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో వినాయక బొమ్మలను ఉంచి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పల్లెలతో పాటు పట్టణాలు, నగరంలోని ప్రధాన కూడళ్లలో వివిధ రూపాల్లో భారీ వినాయక విగ్రహాలను పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రతిమలకు పూజలు చేసి, ప్రసాదాలు పంచిపెట్టారు. చాలా చోట్ల మూడో రోజైన సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. మరికొన్ని చోట్ల తొమ్మిది రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- చిత్తూరు కల్చరల్



సైకిలెక్కిన వినాయకుడు

కుప్పంలో వినాయకుడు సైకిలెక్కాడు. ఎంఎ్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వినాయక చవితి సందర్భంగా స్థానిక యువకులు వినూత్న రీతిలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ పతాకాన్ని కట్టిన సైకిల్‌పై సీఎం చంద్రబాబునాయుడు కూర్చున్నట్లున్న వినాయక ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది. ఎడమ చేతితో సైకిల్ హ్యాండిల్ పట్టుకుని, కుడి చేతిని పైకెత్తి విజయ చిహ్నం చూపుతున్న చంద్రబాబు ఆకారంలో కుప్పం పర్యటనకు వచ్చినట్లుగా రూపొందిన విఘ్నేశుడిని చూడడానికి జనం క్యూ కట్టారు.

- కుప్పం

కాణిపాకంలో వైభవంగా ధ్వజారోహణం



యాగశాల పూజ నిర్వహిస్తున్న అర్చకులు



ఈవోకు రక్షా బంధనం కడుతూ..

- వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 8: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం చేశారు. ఆలయ అణివేటి మండపంలోని ధ్వజ స్తంభాన్ని అభిషేకించారు. అనుజ్ఞ, గణపతిపూజ, మృత్ సంగ్రహణం, వాస్తుశాంతి, నవసంధి బలి, పుణ్యాహవచనం, మూషిక యాగం, ధ్వజపటపూజ,, ధ్వజ స్తంభ అభిషేకం, వాస్తుబలి, మహాహారతినిచ్చి 9- 10 గంటల మధ్య స్వాతి నక్షత్రయుక్త శుభ తులా లగ్నంలో వేదమంత్రాల నడుమ మూషిక ధ్వజ పటాన్ని నింగికి ఎగుర వేశారు.దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలను కామికా ఆవాహన పద్ధతిలో నిర్వహిస్తారు. సాయంత్రం అర్చక, పండితులు యాగశాల ప్రవేశ పూజ నిర్వహించారు. యాగశాలలో ఈవో గురుప్రసాద్‌కు, అనంతరం ధ్వజస్తంభానికి, మూషికానికి అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్ రక్షా బంధనాన్ని కట్టారు. దీనివల్ల బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగవని ప్రజల నమ్మకం. రక్షా బంధనం కట్టున్న వ్యక్తి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఊరి పొలిమేర దాటి వెళ్లకూడదని నియమం.



ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్ - ధ్వజస్తంభంపై ఎగురుతున్న మూషిక ధ్వజపటం

హంస వాహనంపై లంబోదరుడు



బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామికి హంస వాహన సేవ జరిగింది. ఉదయం మూల విరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శ్రీకరుణీక వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను హంస వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, రంగస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

స్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



ఘనంగా 'చవితి' వేడుకలు

కాణిపాకంలో శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అణివేటి మండపం, సుపథ మండపాన్ని వివిధ పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూల విరాట్‌కు కాకర్లవారిపల్లెకు చెందిన గాలి మునస్వామినాయుడు ఉభయదారుగా.. అభిషేకాన్ని నిర్వహించారు అనంతరం ఆలయ అలంకార మండపంలో వినాయక వ్రతాన్ని నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తరపున పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ దంపతులు, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎస్పీ మణికంఠ పట్టు వస్త్రాలను తీసుకొచ్చి సమర్పించారు.



స్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

రేపటికి వాయిదా

చిత్తూరు, సెప్టెంబరు 8: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో మంగళవారం నాటికి మార్పు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గుర్తించాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమాన్ని మంగళవారానికి మార్చినట్లు సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసు కార్యాలయంలో నేడే

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఉంటుంది. ఈ మేరకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ రహదారి సరే.. కాలువ పూడ్చేస్తే ఎలా?

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నగరి/నింద్ర, సెప్టెంబరు 8: జాతీయ రహదారి రాకతో భూముల రేట్లు పెరుగుతాయని, పొలాలకు రవాణా సౌకర్యం వస్తుందనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. పొలాలకు మధ్యలో రోడ్డు రావడంతో పండించిన పంటలను వెలుపలకు తీసుకురావడానికి తిప్పలు తప్పడం లేదన్నారు. భూసేకరణ సమయంలో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన అధికారులు ప్రస్తుతం మాట దాటవేస్తుండడం సరికాదన్నారు. చెరువు కాలువను పూడ్చివేయడంతో 300 ఎకరాలకు సాగునీరు అందించలేకపోతున్నామని రైతులు ఆదివారం నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ఆయనకు కాలువను చూపించారు. రెవెన్యూ అధికారులకు పలుసార్లు విన్నవించినా, స్పందనలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోయారు. అనంతరం నింద్ర మండల పరిధిలోని పాదిరి హైవే వద్ద రైతులతో కలిసి నారాయణ విలేకరులతో మాట్లాడారు. హైవే పక్కనున్న పొలాలకు అడ్డంగా ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, ఈ కారణంగా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కాలువను పూడ్చి వేయడంతో పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందన్నారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే హైవే మీద వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతులు జయచంద్రనాయుడు, చిరంజీవులు నాయుడు, రవికుమార్, దశరథ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి రోడ్డు వద్ద మాట్లాడుతున్న నారాయణ

వినాయక నిమజ్జనానికి రూట్ మ్యాప్

- నేడు వి.కోటలో ప్రత్యేక బందోబస్తు నడుమ విగ్రహాల తరలింపు

వి.కోట, సెప్టెంబరు 8: వి.కోటలో సోమవారం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో విగ్రహాల ఊరేగింపునకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మార్కెట్ నుంచి వచ్చే విగ్రహాలతో పాటు మిగిలిన విగ్రహాలు కలసి వేణుగోపాలస్వామి వీధి మీదుగా ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి పత్రపల్లె చెరువుకు తరలించి నిమజ్జనం చేయనున్నారు. పలువురు దుర్గానగర్ మీదుగా పాపేపల్లి క్రాస్ వద్ద నిమజ్జనం చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్నారు. పత్రపల్లె చెరువు వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో క్రేన్లు ఏర్పాటు చేసి అక్కడకు వచ్చే విగ్రహాలను చెరువులో నిమజ్జనంగావిస్తారు. నిమజ్జనోత్సవానికి అన్ని వర్గాలు సహకరించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్ ఆదివారం కోరారు. వజ్ర వాహనంతో పాటు పలు పెట్రోలింగ్ వాహనాలతో రోజంతా గస్తీ నిర్వహించనున్నారు. ఎస్టీఎఫ్ బలగాలు, సాయుధ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడి ఏర్పాట్లను, వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాలను ఆదివారం సాయంత్రం ఎస్పీ మణికంఠ పరిశీలించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులు, అవాంతరాలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమానికి వెబ్ కెమెరాలతో కవరేజీ ఉంటుందన్నారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పత్రపల్లె చెరువు వద్ద ఏర్పాట్లను ఆయన చూశారు. పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్, తహసీల్దారు పార్వతి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లపై స్థానిక అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

సహకార సంఘాల్లో సభ్యత్వ ప్రక్షాళన

- వివరాల సేకరణలో సచివాలయ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8: సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికిగాను సహకార సంఘాల్లోని సభ్యత్వాలను ప్రక్షాళన చేసేందుకు శ్రీకారం చుట్టింది. సంఘాల్లోని సభ్యుల జాబితాలను ఆయా ఎంపీడీవోలకు అందజేసి గ్రామాల వారీగా సచివాలయ ఉద్యోగుల ద్వారా వివరాల సేకరణ చేయించాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అప్పగించింది. సంఘాల్లో ఉన్న సభ్యులెందరు, వారిలో నకిలీలెవరు, అసలువారెవరనేది ఈ నెలాఖరులోగా తేలిపోనుంది. దీనికి తోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (సింగిల్ విండోలు) బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సిద్ధమైంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఒక వెబ్ పోర్టల్‌ను రూపొందించి నిజమైన సభ్యుల వివరాలను పూర్తిగా క్రోడీకరించి ఇందులో నమోదు చేస్తున్నారు. నకిలీలను తొలగిస్తే అసలైన సభ్యులతో ఎన్నికలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 75 సంఘాలుండగా, వాటి వ్యవహారాలన్నీ చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అజమాయిషీలోనే నడుస్తున్నాయి. 75 సంఘాల్లో 3,56,066 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఏ ఒక్క సంఘంలోనూ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేవు. దీనిని గుర్తించిన ప్రభుత్వం బోగస్ సభ్యత్వాలను తొలగించి, ప్రక్షాళన చేయడానికి సిద్ధమైంది.

ఈకేవైసీ చేయించుకోవాలి

సింగిల్ విండోల్లోని సభ్యుల వివరాలు సేకరించే పనిని ఎంపీడీవోలకు కలెక్టర్ అప్పగించారు. సభ్యుల జాబితాలను ఎంపీడీవోలకు పంపి సచివాలయ ఉద్యోగుల ద్వారా గత 10 రోజులుగా వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. జాబితాలో సగం మంది సభ్యుల వివరాలు కూడా దొరకడం లేదు. మృతులు, వలస వెళ్లిన వారంతా ఇంకా కొనసాగుతున్నట్లు జాబితాల్లో ఉండడం కొసమెరుపు. రైతులకు సంబంధించిన భూవివరాలు కూడా నమోదు కాలేదు. ఆధార్ నెంబర్లు, పాస్‌పుస్తకాల ఖాతా నెంబర్లు కూడా దొరకడం లేదు. ఖాతా నెంబర్లే లేకుండా చాలా విండోల్లో ఎలా రుణాలు మంజూరు చేశారో అర్థంకావడం లేదు. విండోల్లో రుణాలు తీసుకున్న, తీసుకోనివారి వివరాలు కూడా స్పష్టంగా లభించడం లేదు. దీంతో సింగిల్ విండోల్లో సభ్యత్వాలు ఉన్న రైతులు తమ వద్ద వున్న ఆధారాలతో ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే సభ్యత్వాలు తొలగిస్తామని ఆయా విండోల సీఈవోలు స్పష్టం చేస్తున్నారు. తాజా సమాచారం మేర 3,56,066 మంది సభ్యులుగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు 1,13,812 మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నట్లు సమాచారం. సభ్యత్వ నమోదు రుసుము రూ.350 చెల్లించాల్సివుండగా, చాలామంది గతంలో రూ.10 మాత్రమే చెల్లించిన వారు లక్ష మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గతంలో సహకారసంఘాల ఎన్నికల్లో ఎడాపెడా సభ్యత్వాలు నమోదు చేయడమే గందరగోళానికి కారణమైంది. సభ్యుల పేర్లు తెలియకపోయినా, చాలా మంది ఎన్నికల్లో పోటీచేసినవారు సభ్యుల పేర్లతో సభ్యత్వ రుసుములు చెల్లించడమే ఈ అనర్థాలకు కారణమని ఆరోపణలు వినవస్తున్నాయి.



11 ఏళ్ల కిందట ఎన్నికలు

సింగిల్ విండోలకు ఉమ్మడి జిల్లాలో 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో ఎన్నికలు జరగాల్సివుండగా సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వాయిదా పడ్డాయి. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించింది. గత వైసీపీ పాలనలో త్రిసభ్య కమిటీల పేరుతో పర్సన్ ఇన్‌చార్జులను నియమించింది. ఈ కమిటీలను ప్రతి ఆరునెలలకోసారి పొడిగిస్తూ వచ్చింది. తాజాగా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ పట్టివేత




పట్టుబడిన గ్రానైట్ లారీ, ట్రాక్టర్

గుడుపల్లె, సెప్టెంబరు 8: ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు రాష్ట్రాలకు తరలిస్తున్న గ్రానైట్ వాహనాలను పోలీసులు పట్టుకొన్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. గుడుపల్లె మండలం మీదుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొన్ని రోజులుగా రహదారుల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. శనివారం ఉదయం కుప్పం-పలమనేరు జాతీయ రహదారి, శెట్టిపల్లె సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. వేగంతో వస్తున్న గ్రానైట్ లారీ కంటపడిందన్నారు. లారీని ఆపి.. డ్రైవర్‌ను ప్రశ్నించగా అతడి వద్ద గ్రానైట్ తరలింపునకు సంబంధించిన పత్రాలు ఏవీ లేవు. తమ విచారణలో గ్రానైట్‌ను తమిళనాడుకు తరలిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. అలాగే పొగురుపల్లె మార్గంలో గ్రానైట్ బ్లాకుతో ట్రాక్టర్‌లో తరలిస్తున్న వాహనాన్ని ఆపగా..ఈ ట్రాక్టర్‌లోని గ్రానైట్ అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. ఈ రెండింటిని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ రెండు గ్రానైట్ వాహనాలను పలమనేరు మైన్స్ ఏడీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

పిచ్చికుక్క వీరంగం

● 10 మందికి గాయాలు



గాయపడిన యువకుడు

పూతలపట్టు, సెప్టెంబరు 8: పూతలపట్టులో ఆదివారం పిచ్చికుక్క దాడిలో దాదాపు 10 మంది గాయపడ్డారు. ఉదయం పోలీసుస్టేషన్ సమీపంలో పిచ్చికుక్క అటుఇటు పరుగులు తీస్తూ కనిపించిన వారందరిపైనా దాడి చేసింది. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8: జిల్లా ఏపీ పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్స్) అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం చిత్తూరులో జిల్లా ఇన్‌చార్జి ఎన్.గురునాథం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామచంద్రన్, ఉపాధ్యక్షులుగా బాబురెడ్డి, రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా కె.బి.నిరంజన్, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా రెహమాన్, కోశాధికారిగా ప్రదీప్, సంయుక్త కార్యదర్శులుగా జయంతి, పురుషోత్తం, పబ్లిసిటీ సెక్రటరీగా ప్రేమ్‌సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కార్తీక్, సుమంత్, ఈసీ మెంబర్లుగా షబీర్, కేబీ పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెలాఖరులోగా మండలాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని తీర్మానించారు.

ద్రవిడ వర్సిటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



పీఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

గుడుపల్లె, సెప్టెంబరు 8: ఓ వైపు జీతాలు రాకపోవడం.. మరో వైపు అప్పుల బాధ తాళలేక ద్రవిడ విశ్వవిద్యాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. కుప్పిగానిపల్లెకు చెందిన రామకృష్ణ(56) ద్రవిడ విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొన్ని నెలలుగా జీతాలు రాలేదు. దీంతో విధులకు హాజరుకావడం లేదు. కుటుంబ పోషణ కోసం కొందరి దగ్గర అప్పులు చేశారు. నెలలు గడుస్తున్నా జీతాలు రాకపోగా అప్పుల వారి నుంచి ఒత్తిళ్ల ఎక్కువయ్యాయి. శుక్రవారం అప్పు ఇచ్చినవారు డబ్బులు అడగడంలో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోని ఓ గదిలో ఉరేసుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించి కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళకరంగా ఉంది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు.

రుయాలో డాక్టర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: రుయాస్పత్రిలోని డాక్టర్లపై దాడి చేసిన కేసులో తిరుపతికి చెందిన ఏడుగురిని వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి 11.30 గంటలకు రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ ముందు పీజీ డాక్టర్లపై విచక్షణా రహితంగా కొందరు దాడిచేశారు. ఈ కేసులో చింతలచేనుకు చెందిన ఏసీ మెకానిక్ షేక్షావలి, షేక్ చాంద్‌బాషా, మునికృష్ణ వసంత్, జె.కృష్ణబాబు, ఎస్.మణి, పి.శివకుమార్, బి.సాయికుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో డీఎస్పీ వెంకటనారాయణ, వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి చింతలచేను రైల్వే ట్రాక్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. అనవసరంగా ఆసత్రుల్లో డాక్టర్లపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ రామకృష్ణ, సిబ్బందిని అభినందించారు.

కుప్పం 'కేంద్రీయ విద్యాలయ'లో కదలిక

● ప్రభుత్వానికి స్థల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు



బైరుగానిపల్లె వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కడా పీడీ తదితరులు (ఫైల్ ఫొటో)

కుప్పం, సెప్టెంబరు 8: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే కుప్పం అభివృద్ధి ఊపందుకుంది. ఒకవైపు విజన్ డాక్యుమెంట్ తుది దశ మెరుగులు దిద్దుకుంటుండగా, మరోవైపు ఇప్పటికే ప్రకటించిన ప్రాజెక్టులు పట్టాలకెక్కుతున్నాయి. కుప్పంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకోసం చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికోసం కలెక్టర్ సుమిత్ కుమార్‌తోపాటు కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దారు చిట్టిబాబు తదితరులు వివిధ ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. చివరకు కుప్పం పురపాలక సంఘం పరిధిలోని బైరుగానిపల్లె ప్రాంతంలో స్థలాన్ని గుర్తించారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి వెనుక వైపున మునిరాజు అనే రైతు భూమిని కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అధికారులు సుమారు 25 రోజుల క్రితం ఎంపిక చేశారు. ఇక్కడ రైతుకు సంబంధించిన 1.40 ఎకరాల పట్టా భూమిలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించి, ఆ రైతుతో చర్చించారు. దీనికి ప్రత్యామ్నాయంగా 2.14 ఎకరాల స్థలాన్ని వేరేచోట ఇస్తామన్న తర్వాత ఆ రైతు అంగీకరించారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని సైతం గుర్తించి, ప్రతిపాదనను సిద్ధం చేసిన స్థానిక రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఆ ఫైల్ పంపారు. అయితే మునిరాజు అనే రైతు తన స్థలాన్ని ముందుగా ప్రభుత్వానికి రిజిస్టర్ చేయాలని, కలెక్టర్‌నుంచి కుప్పం తహసీల్దారు చిట్టిబాబుకు ఇటీవల ఆదేశాలు అందాయి. అలా చేస్తేనే ప్రత్యామ్నాయ స్థలాన్ని రైతుకు అప్పగించి, రిజిస్టర్ చేసేందుకు వీలవుతుందని కలెక్టర్ సూచించారు. దీంతో తహసీల్దారు స్థల యజమాని అయిన రైతు మునిరాజును తన కార్యాలయానికి పిలిపించారు. తొలుత తనకు ప్రభుత్వంనుంచి భూమి రిజిస్ట్రేషన్ చేసిన తర్వాతనే, తన భూమిని ప్రభుత్వానికి రిజిస్టర్ చేస్తానని రైతు చెప్పారు. అయితే తహసీల్దారు ఆయనకు అర్థమయ్యేలా పరిస్థితిని వివరించడంతో తన పేరుమీద ఉన్న భూమిని ప్రభుత్వానికి బదలాయించేందుకు మునిరాజు సంసిద్ధత వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రభుత్వం తరఫున రిజిస్ట్రార్ శాఖకు స్టాంపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలోని స్థలం కావడంతో ఆ ఫీజు లక్షల్లో ఉండే అవకాశం ఉంది. ఈ ఫీజు మొత్తాన్ని ఏ పద్దు కింద చెల్లించాలన్న మీమాంస ప్రస్తుతం నెలకొంది. ఇది తొలగి ఒక స్పష్టత వచ్చాక కేంద్రీయ విద్యాలయ స్థాపనకోసం గుర్తించిన స్థలం, ప్రభుత్వ పరమవుతుంది. ఆపైన విద్యాలయ స్థాపనకు శరవేగంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.




వ్యానును విరాళంగా అందిస్తున్న దాత - లక్ష విరాళంగా అందిస్తున్న దాత

అన్నదాన సత్రానికి వాహన వితరణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8: కాణిపాక క్షేత్రంలో ఆలయ ఆధ్వర్యంలోని అన్నదాన సత్రానికి కూరగాయలు తరలించడానికి వాహనం కానుకగా అందింది. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, జైల్‌సింగ్ వారి మిత్ర బృందం కలిసి రూ.12 లక్షలు విలువ చేసే వాహనాన్ని శనివారం అందజేశారు. అలాగే 2.5 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. దాతలను ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శనం చేయించారు. అలాగే, బంగారుపాళ్యం మండలం కొత్తవెంకటాపురానికి చెందిన మోహన్‌నాయుడు, అన్నదాన కార్యక్రమానికి రూ.1,11,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, అన్నదానం ఏఈవో ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో..

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని చవితి సందర్భంగా శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి, కేంద్ర ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటి కార్యదర్శి ఆశీష్‌గుప్తా తదితరులు స్వామి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం వీరిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందించారు.




లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో గురుప్రసాద్ - ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటీ కార్యదర్శి అశీష్‌గుప్తాకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

58.5 కిలోల గంజాయి పట్టివేత

తిరుపతి జిల్లాలోని పలుప్రాంతాల్లో బాలుడి సహా ఏడుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

గూడూరు, సెప్టెంబరు 8: తిరుపతి జిల్లాలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖపట్నం నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న గుంటూరు జిల్లాకు చెందిన సంజయ్‌కుమార్, ఉమాశంకర్, నీలయ్యలను విచారించారు. విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో విక్రయిస్తున్నట్లు తేలిందని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో..

వెంకటగిరి టౌన్: కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి తాలుకా విజయపురానికి చెందిన నరసింహరాజు స్టేషన్‌లో శనివారం అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఇతను ఒడిశా నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

తిరుపతిలోనూ..

తిరుపతి(నేరవిభాగం): తిరుపతిలోనూ శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తన సిబ్బందితో కలిసి కొర్లగుంటలో గంజాయి విక్రయిస్తున్న కందాటి సాయిచందు, అర్.దేవరాజన్, ఎస్.హరినాథ్ సింగ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగున్నర కిలోల గంజాయితోపాటు మత్తు బిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, సిబ్బంది కలసి తనిఖీలు చేశారు. బొమ్మగుంటలో ఓ బాలుడి (17) వద్ద నుంచి 21 కిలోల గంజాయి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.35 కోట్లు

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండురోజుల్లో రూ.6.35 కోట్లు లభించింది. గురువారం, శుక్రవారం కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.6.35 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్ర, శనివారాల్లో 1.42 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈరెండురోజుల్లో 53,159 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

విజయవాడకు 150 మంది రెవెన్యూ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయం అందించేందుకు జేసీ విద్యాధరి సహా 150 మంది రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు బయలుదేరి వెళ్లారు. వీరిలో జేసీ విద్యాధరి రెండ్రోజుల క్రితమే వెళ్లగా మిగిలిన వారు శనివారం రాత్రి చిత్తూరు నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం విజయవాడలో రిపోర్టు చేశారు. వీరిలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డితో పాటు 16 మంది తహసీల్దార్లు, 66మంది డిప్యూటీ తహసీల్దార్లు, 37 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు ఉన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 25 మంది పంచాయతీ సెక్రటరీలు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు వెళ్లినట్లు డీపీవో లక్ష్మి తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా భాస్కర్



వెదురుకుప్పం, సెప్టెంబరు 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా(డీసీసీ) వెదురుకుప్పం మండలం బలిజమొండి వెంగనపల్లికి చెందిన పోటుగారి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలఉత్తర్వులు జారీ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాస్కర్ చెప్పారు. ఈయన నియామకం పట్ల కాపు సంఘ నేత జీకే నాగరాజు, ఆ కాంగ్రెస్ పార్టీ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు హమేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్వీయూ ప్రతినిధుల అమెరికా పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8: ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం అమెరికాకు పయనమైంది. ఈ బృందం 20 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనుంది. ఈ బృందంలో ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, వైరాలజీ ప్రొఫెసర్ హేమ, ఇంగ్లీషు ప్రొఫెసర్ సుమకిరణ్, రుసా ప్రతినిధి వంశీకృష్ణ, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రమాశ్రీ, తదితరులు ఉన్నారు. ఎస్వీయూనివర్సిటీ, అమెరికాలోని ఫార్డూ యూనివర్సిటీల మధ్య ఎంటర్‌ప్రైనర్‌షిప్ (బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పర సహకారం) కల్పించేందుకు ఈనెల ఏడో తేదీన తిరుపతి నుంచి బయల్దేరి వెళ్లినట్లు సమాచారం. చాలాకాలం కిందటే ఈ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నా అనేక కారణాలతో ఆలస్యమైంది. ఈ పర్యటన తర్వాత, అమెరికన్ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా త్వరలో ఎస్వీయూనివర్సిటీని సందర్శించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

వేర్వేరు ఘటనల్లో 40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురి అరెస్టు



చక్రాయపేట వద్ద పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 8: తిరుపతి, కడప జిల్లాల్లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి 40 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్ శనివారం తెల్లవారుజామున కరకంబాడి అటవీప్రాంతంలోని తిరుపతి-కడప జాతీయ రహదారిలో ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పారిపోయారు. మరో ఇద్దరిని టాస్క్‌ఫోర్సు బృందం పట్టుకోగలిగింది. పట్టుబడ్డ ఇద్దరు తమిళనాడులోని సేలం జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి కారులోని 12దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. మరో ఘటనలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం కడపజిల్లా చక్రాయపేట వద్ద కూంబింగ్ చేస్తుండగా మాలబీళ్ల వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుంటూ వస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన వారు పారిపోగా ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతను కడపజిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఒకమోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ రెండింటిపై తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఎస్ సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కరకంబాడి వద్ద ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్ మృతి

మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలు




లారీని ఢీకొన్న మరో లారీ - డ్రైవర్ నాగరాజు మృతదేహం

పాకాల, సెప్టెంబరు8: పాకాల మండలం నేంద్రగుంట సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపైన ఆదివారం ఉదయం ఆగివున్న లారీని వెనుకవచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. అదనపు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి వెస్ట్‌బెంగాల్‌కు బ్రిక్స్ లోడుతో వెళ్తున్న లారీ నేంద్రగుంట సమీపంలో శనివారం అర్ధరాత్రి మరమ్మతులకు గురైంది. దీంతో లారీ డ్రైవర్ లారీని రోడ్డు పక్కగా ఆపివేశాడు. ఆదివారం ఉదయం చిత్తూరు వైపు నుంచి భద్రాచలానికి కట్టెల లోడుతో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఆపివుంచిన లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాది కొత్తగూడెం ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ నాగరాజు (24) మృతిచెందాడు. అదనపు డ్రైవర్ సాయిబాబు (45) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అతికష్టంమీద క్యాబిన్ తొలగించి సాయిబాబును బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన ఇతనిని చికిత్సకోసం అంబులెన్స్‌లో తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. మృతిచెందిన నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిచ్చురేపిన 'ర్యాష్ రైడింగ్'

● రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులతో పరిస్థితి ఉద్రిక్తం

● అడ్డుకోబోయిన ఎస్ఐకి స్వల్ప గాయం ● ఓ ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దం

కేవీబీపురం, సెప్టెంబరు 8: పక్క గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ గ్రామంలో ద్విచక్ర వాహనాలను ర్యాష్‌గా నడపడంపై స్థానిక మహిళలు ప్రశ్నించారు. దీనిపై మాటామాటా పెరిగి రెండు గ్రామాల మధ్య దాడులకు దారితీసి, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రాగిగుంటలో అతివేగంగా చక్కర్లు కొట్టారు. భయపడ్డ స్థానిక మహిళలు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. కాసేపటికి ఆ యువకులు అక్కడినుంచి వెళ్లి తమ గ్రామం సుమారు 30మందిని వెంటబెట్టుకొచ్చారు. దీంతో ఈ గొడవ కాస్తా రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులకు దారితీసింది. ఆదివారం ఉదయం మళ్లీ పెరిందేశంవాసులు మళ్లీ రాగిగుంటకు చేరుకున్నారు. దుకాణాలను ధ్వంసం చేసి, పెరిందేశం గ్రామస్తులపై దాడికి దిగారు. దీంతో రెండు గ్రామాలవారు కొట్లాటకు తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవను అడ్డుకోబోయిన పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్‌పైనా మద్యం సీసాలు విసరడంతో ఎడమ కన్ను వద్ద స్వల్ప గాయమైంది. మరోవైపు రాగిగుంటవాసులు పిచ్చాటూరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఏఎస్ఐ లోకనాథం అండతోనే పెరిందేశంవాసులు దాడి చేశారని ఆరోపించారు. ఈక్రమంలో గుర్తుతెలియని ఆందోళనకారులు అటుగా వచ్చిన శ్రీకాళహస్తి డిపోకి చెందిన బస్సు అద్దాన్నీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రవి మనోహరాచారి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పలువురు సీఐలు, ఎస్ఐలతో ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఈ గొడవతో సంబంధం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, రెండు గ్రామాల్లోనూ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

మామ అల్లుళ్లపై వేటుకు సన్నద్ధం

కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మామ అల్లుళ్లపై బదిలీ వేటుకు అధికారులు సన్నద్ధమైనట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులు ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేందుకు వీలుండదు. అయితే ఏఎస్ఐ.. రాజకీయ అండతో తన కుమార్తె భర్త అయిన కానిస్టేబుల్‌ను తాను పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు డీవోగా తెచ్చుకున్నారు. ఈ ఏఎస్ఐ పనిచేసినా ప్రతిచోటా అనేక ఆరోపణలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. నెల కిందట కానిస్టేబుల్ అయిన అల్లుడు ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకుని చెల్లించకపోగా, తప్పుడు కేసు పెడతానంటూ బెదిరించడంపై బాధితుడు 100కు ఫోన్ చేశాడు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కొంత నగదు వసూలు చేయించిన ఘటన కూడా ఆదివారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు ఈ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కూడా నియమించకుండా తానే చక్రం తిప్పుతున్నట్లు ఫిర్యాదు అందాయి. తాజాగా ఇదే ఏఎస్ఐ అండతోనే తమపై దాడి జరిగినట్లు రాగిగుంటవాసులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మామాఅల్లుళ్లను తిరుపతి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి రిపోర్టు చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.



నిరసన తెలుపుతున్న రాగిగుంట గ్రామస్తులు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

నిట్‌లో సీటు సాధించిన సదుం విద్యార్థి



హర్షవర్దన్

సదుం, సెప్టెంబరు 8: మండలంలోని బూరగమంద పంచాయతీ పచ్చార్ల మాకులపల్లె నివాసి, ఎంపీటీసీ మల్లికార్జున, స్వర్ణలత దంపతుల కుమారుడు హర్షవర్దన్ పుదుచ్చేరి పరిధిలోని పుదుచ్చేరి ఎన్ఐటీలో బీటెక్ సీటు సాధించాడు. ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో 31 వేల ర్యాంకుతో ఓబీసీ కేటగిరీలో బీటెక్ కంప్యూటర్స్ సైన్స్ కోర్సుకు హర్షవర్దన్ ఎంపికయ్యాడు. హర్షవర్ధన్‌ను ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఊరూ వాడా.. జైజై..గణేశా



గుడుపల్లెలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం

గుడుపల్లె, సెప్టెంబరు 8: మండలంలో గ్రామాల్లో వినాయక చవితిని ప్రజలు ఘనంగా చేసుకున్నారు. గ్రామాల్లోని వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు పిండి వంటలు, వివిధ ఫలాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అన్నదానాలు చేశారు. ఆటల పోటీలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండ్రాలయ్యా..దండాలయ్యా



రాళ్లబూదుగూరు పోలీసు స్టేషన్ ఎదుట ప్రతిష్టించిన గణపయ్య

శాంతిపురం, సెప్టెంబరు 8: శాంతిపురం మండలంలోని శనివారం వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వాడవాడలా వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలోనూ గణపయ్యకు పూజలు చేశారు.

వరద బాధితులకు కూరగాయల వితరణ



కూరగాయలు పంపుతున్న మాన్‌టెక్ కార్లో సంస్థ ప్రతినిధులు

వి.కోట, సెప్టెంబరు 8: విజయవాడలో ఇటీవల వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు వి.కోట మార్కెట్ నుంచి 15 మెట్రిక్ టన్నుల కూరగాయలను వితరణగా ఇచ్చారు. ఆదివారం మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ నేతృత్వంలో కూరగాయల టెంపోను జెండా ఊపి విజయవాడకు పంపారు. వదర బాధితులకు తమ వంతు సహకారంగా ప్రభుత్వం తరపున రూ. 1.75 లక్షలు విలువ చేసే కూరగాయలను వరద బాధితులకు పంపుతున్నట్లు మాన్‌టెక్ కార్లో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజశేఖర్, ఇతర ప్రతినిధులు తెలిపారు.

కోలాహలంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం



నడిగడ్డలో బొజ్జగణపయ్యకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

సదుం, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను శుక్ర, శనివారాల్లో మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంటింటా బొజ్జ గణపయ్య ప్రతిమలను కొలువు దీర్చి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. గ్రామ గ్రామాన అందమైన వినాయక విగ్రహ మంటపాలను విద్యుత్ దీపాలు, ఫల, పుష్పాలతో సుందరంగా అలంకరించి నిత్య పూజలు చేశారు. రాత్రిపూట యువత సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకున్నారు. కొన్నిచోట్ల ఆదివారం నిమజ్జనం చేశారు.

ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు రూరల్, సెప్టెబరు8: వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులు, డప్పు వాయిద్యాలు చేసే సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో ముస్లిం మత పెద్దలు, హిందూజాగరణ సమితి, ఆర్ఎస్ఎస్, ప్రజా సంఘాలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరులకు ఇబ్బం దులు లేకుండా పండుగలు చేసుకోవాలని కోరారు. ఎస్ఐ రాజేశ్, డిప్యూటీ తహసీల్దార్ తసీనా, ఆర్ఐ వసీం పాల్గొన్నారు.

మహిళలకు పండ్ల మొక్కల పంపిణీ



పలమనేరు, సెప్టెంబరు8 : పలమనేరులో ఆదివారం ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, జేటీడీ, బెంగళూరు యక్ష సౌజన్యంతో గ్రామీణ పేదమహిళలకు అల్లనేరేడు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.

వైభవంగా వినాయక చవితి



కుప్పం రైల్వే స్టేషన్ వద్ద వెంకటేశ్వరుని రూపంలోని వినాయక ప్రతిమ

కుప్పం, సెప్టెంబరు 8: కుప్పంలో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో భారీ వినాయక ప్రతిమలను యువ బృందాలు ప్రతిష్ఠించాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆ ప్రతిమలకు పూజలు చేసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సైకిలెక్కిన చంద్రబాబు రూపంలోని వినాయకుడు విశేషంగా ఆకట్టుకున్నాడు. అలాగే కుప్పం రైల్వే స్టేషన్ వద్ద వెంకటేశ్వర వినాయకుడు, ప్యాలెస్ రోడ్డు ప్రాంతంలో బాల వినాయకుడు, విశ్వరూప వినాయకుడు, ఇలా పలు రూపాలలో విఘ్నేశుని ప్రతిమలు ప్రదర్శించారు. ఆయా మండపాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ఇంటింటా గణపయ్యకు పూజలు



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 : మండలంలో శనివారం వినాయకచవితిని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో వినాయక ప్రతిమలను కొలు వుదీర్చి పూజలు చేశారు. ఇళ్లలో వినాయక ప్రతిమలకు విశేషాలంకరణ చేసి కుడుములు, ఉండ్రాళ్లు, సమర్పించారు.

మార్మోగుతున్న గణేశుడి నామం



దయ్యాలపల్లెలో ఏర్పాటు చేసిన విగ్రహం

వి.కోట, సెప్టెంబరు 8: వి.కోట మండల పరిధిలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలో 15 చోట్ల గణనాథుడి భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. దుర్గానగర్‌లో అభయ గణపతి విగ్రహానికి గత రెండు రోజులుగా విశేష పూజలు చేశారు. ఆలయ కమ్యూనిటీ భవనంలో భక్తి గీతాలాపన, కూచిపూడి నృత్య, నాట్య ప్రదర్శన భక్తులను ఆట్టుకుంది. మార్కెట్, కన్యకాపరమేశ్వరి వీధి, బ్రాహ్మణ వీధి, ఆంజనేయస్వామి ఆలయం ఎదుట, ఈశ్వర్ నగర్, సత్యసాయి నగర్, స్కూల్ వీధి, ట్యాక్సీ స్టాండు, అంబేడ్కర్ నగర్, కలాంస్ట్రీట్, కుప్పం రోడ్డు టెంపో స్టాండు, ముదిమడుగు, పత్రపల్లె, దాసార్లపల్లె, గాండ్లపల్లె, కర్రిపల్లె, పాపేపల్లి, చౌడేపల్లి గ్రామాల్లో గణనాథుడి విగ్రహాలు కొలువుదీరాయి. అలాగే ముదరందొడ్డిలో ఆదివారం వినాయక విగ్రహాలను కోలాహలంగా నిమజ్జనం చేశారు.

రేపు జాబ్ మేళా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా మంగళవారం జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుంగనూరులో ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఈ మేళాకు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, మోడ్రన్ వీర్ రేస్ సెక్యూరిటీ ఫోర్స్ సంస్థల ప్రతినిధులు హాజరై పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ డిప్లమో లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు.

విఘ్ననాథుడికి విశేషపూజలు





పలమనేరులో పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు

పుంగనూరు, సెప్టెంబరు8: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పుంగ నూరు పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు సంబరంగా సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వివిధ రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఏర్పాటు చేసి , శనివారం అర్చకులతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిం చారు. పుంగనూరు ఎన్ఎస్‌పేట, తూర్పుమొగసాల, తోపుమఠం, మల్లారమ్మవీధి, చింతలవీధి. బజారువీధి, నాగపాళ్యం, బస్టాండు, కొత్తయిండ్లు, కొత్తపేట, మేలుపట్ల, భగత్‌సింగ్‌కాలనీ, మంగళం, చదళ్ల, ఈడిగపల్లె, వనమలదిన్నె, ఏతూరు తదితర గ్రామాల్లో దాదాపు 7 అడుగుల నుంచి 15 అడుగుల వినా యక విగ్రహాలను నిలిపారు. స్థానిక కుమ్మరవీధిలో పిల్లలకు చెస్ ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం ప్రజలు వినాయక ఆలయాలకు వెళ్లడం, ఇళ్లల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి వినాయక జననం, ఉపవాసాలతో ప్రత్యేక వ్రత పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం నాగలరాళ్ల, పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. ఆదివారం కొందరు మట్టి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రాజేశ్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పారిశుధ్య పనులను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

ఆకట్టుకొంటున్న ప్రతిమలు

పలమనేరు: వినాయకచవితి సందర్భంగా పలమనేరులో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు అందరినీ ఆకట్టుకొంటున్నాయి. గత ఏడాదికంటే ఈసారి అధిక సంఖ్యలో వినాయక పతిమలను ప్రధాన కూడళ్లలోను, వీధుల్లోను ఏర్పాటు చేశారు. ఉదయం సాయం త్రం మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. 9 రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేయనున్నారు.




పుంగనూరులోని ఎన్ఎస్‌పేటలో వినాయకుడు, కుమ్మరవీధిలో చెస్ పోటీల్లో పాల్గొన్న పిల్లలు

కథా ప్రవచనం పుస్తకావిష్కరణ



పలమనేరు, సెప్టెంబరు8 : పలమనేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం కథాప్రపంచం -2023 పుస్తకావిష్కరణ జరిగింది. అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా పలమనేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. స్థానిక దివంగత కెమిస్ట్రీ అధ్యాపకులు మలిశెట్టి సీతారాం పేరిట ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన తెలుగు కథల పోటీల్లో బహుమతి పొందిన కథలతో ప్రచురితమైన ఈ పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్. మాధవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ, రచయితల సంఘం ప్రధానకార్యదర్శి డి.కుమారస్వామిరెడ్డి, రచయితలు యుగంధర్, దోర్నాల దేవేంద్ర సిద్ధార్థ, చంద్రశేఖరయ్య, డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర, రైతు నాయకులు ఉమాపతి నాయుడు, రసజ్ఞుల సమాఖ్య శ్రీపురం సీతారామయ్య, మురళీధర్, కందుకూరి సుదర్శనాచారి, నెల్లిపట్ల కేవవులు, వీరభద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిలో ఊరేగిన మోక్ష గణపతి



మోక్షగణపతికి పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త లక్ష్మణరాజు దంపతులు, గ్రామస్తులు

చౌడేపల్లె, సెప్టెంబరు8: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శెట్టి పేటలో వెలసిన మోక్ష గణతి పురవీధుల్లో పుష్ప పల్లకిలో ఊరేగారు. శనివారం వినాయక చవితి సందర్భంగా టీడీపీ నాయకులు లక్ష్మణరాజు (పతిరాజు) తన సొంత నిధులతో నిర్మించిన మోక్ష గణపతికి వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ట్రాక్టర్‌పై స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ శెట్టిపేట, ఎర్రగానిపల్లె, కొత్తఇండ్లు, మేకల చిన్నేపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల్లో ఊరేగించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేశారు. స్వామివారి లడ్డూను శెట్టిపేటకు చెందిన శ్రీనివాసులు రూ.86వేలకు దక్కించుకున్నారు. అలాగే స్థానిక మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం వద్ద, నడివీధి గంగమ్మ ఆలయం వద్ద, రామాలయం వద్ద, బస్టాండులో, అన్నిగ్రామాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు.

వాడవాడలా చవితి సంబరాలు




శివాజీ నగర్‌లో మూడు శిరస్సుల వినాయకుడు, ప్రాకారోత్సవంలో సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, సెప్టెంబరు 8: రామకుప్పం మండలంలో వినాయక చవితి వేడుకలను వాడవాడల ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో, వీధివీధినా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఇళ్లలో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యంగా సమర్పించారు. వళ్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రాకారోత్సవం చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

ఊరూవాడా గణనాథుడి సంబరం



శెట్టివారివీధిలో వినాయక స్వామి పూజలో శివాలయం రాయల్ యూత్

సోమల, సెప్టెంబరు 8: సోమల మండలంలో వినాయక చవితి వేడుకలు శని వారం వాడవాడల్లో ఘనంగా జరిగాయి. పందిళ్లు వేసి విద్యుత్ అలంకరణతో స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. రాత్రి యువకులు వివిధ సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించారు. ఎగువపల్లెలో స్వామివారి లడ్డూను రూ. 15,116కు బుడ్డా అభిషేక్, బొడ్డులోని వెండి కాయిన్‌ను రూ.10,116కు దినేష్ వేలంలో దక్కించుకున్నారు. ఎగువపల్లె యూత్ సభ్యులు సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన స్వామివారి ప్రతిమను కోలాహలంగా నిమజ్జనం జరిపారు. నిమజ్జన కార్యక్రమాలను ఎస్ఐ శివశంకర పర్యవేక్షించారు.

గణేశుడికి చల్లాబాబు పూజలు



కల్లూరులో పూజలు నిర్వహిస్తున్న చల్లా బాబు

కల్లూరు, సెప్టెంబర్ 8: గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. పులిచెర్ల మండలం కల్లూరులో శనివారం నిర్వహించిన చవితి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం తలారి వారిపల్లి, కొత్తకాలనీ, దాసరి గూడెంలో ఏర్పాటుచేసిన గణపయ్యలను ఆయన దర్శించుకున్నారు. టీడీపీ నాయ కులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.

కోలాహలంగా నిమజ్జనం



పెద్దకురవపల్లెలో నిమజ్జన కోలాహలం

రొంపిచెర్ల, సెప్టెంబరు8: మండలంలో ఇళ్లలో, వీధుల్లో వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. యువత వినాయక మండపాలను విద్యుత్ దీపాలు, పచ్చనితోరణాలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల నిమజ్జనం చేశారు.

వరాలిచ్చే సుబ్రహ్మణ్యుడు

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు




ప్రకృతి సోయగాల మధ్య వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి (ఫైల్ ఫొటోలు)

రామకుప్పం, సెప్టెంబరు 9: రామకుప్పం శివార్లలోని వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక సోమవారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా వినాయకచవితి మొదలు ఆరు సోమవారాలు సోమవారోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి. ఈ క్రమంలో ఆలయంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

భక్తుల కొంగుబంగారం

ఇక్కడ సప్త శిరస్సుల సర్పాకృతిలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామిని మూడు రాష్ట్రాల ప్రజలు మహిమాన్వితుడిగా కొలుస్తారు. ఇక్కడి క్షేత్రాన్ని హిందువులు సుబ్రాయుణి తోపుగా, ముస్లింలు సుబాన్‌జీ తోపుగా వ్యవహరిస్తారు. కష్టాల కడలిని ఈదుతున్న భక్తులు సుబ్రహ్మణ్యస్వామిని దర్శిస్తే అన్ని బాధలు దూరమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వందేళ్ల క్రితం ఇక్కడి ముళ్లకంపల మధ్య సర్పాకృతిలోని చిన్న రాతి విగ్రహాన్ని పశువుల కాపర్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆ విగ్రహాన్ని సుబ్రహ్మణ్య స్వామి ప్రతిరూపంగా భావించి కొలవసాగారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఈశాన్య దిక్కున గల నాగుల పుట్ట వద్ద గల రావిచెట్లకు జోలలు కడితే సంతానభాగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు స్వామి వారి హుండీలో వెండితో చేసిన కళ్లు, చెవులు, నాగపడిగలు సమర్పించుకుంటే రోగ విముక్తులవుతారని భక్తుల నమ్మకం. అదే విధంగా సోమవారోత్సవాల్లో స్వామివారికి ప్రాకారోత్సవాలు చేయిస్తే కోరికలు నెరవేరుతాయని ప్రతీతి.

రెండు మాసాల పాటూ కావళ్ల సమర్పణ

దేశవ్యాప్తంగా భక్తులు సుబ్రహ్మణ్యస్వామికి ఆషాఢ మాసంలో మాత్రమే కావళ్లు, వీపుతేర్లు సమర్పిస్తారు. రామకుప్పం సుబ్రహ్మణ్యస్వామికి ఆషాఢ మాసంతో బాటూ, భాద్రపద మాసంలో జరిగే సోమవారోత్సవాల్లోనూ భక్తులు కావళ్లు సమర్పిస్తారు. అదేవిధంగా పలువురు భక్తులు వీపుతేర్లు లాగుకుంటూ, దవడలకు భారీ సైజు శూశాలలను గుచ్చుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

భక్తుల కోసం వసతుల కల్పన

ఆలయ కమిటీ వారు ఉత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి సోమవారం వేలాదిగా తరలివచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఆర్టీసీ అధికారులు మన జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం సరిహద్దు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నారు.

దినదిన ప్రవర్ధమానంగా సుబ్రహ్మణ్య క్షేత్రం

ఐదు దశాబ్దాల క్రితం వరకు రాతిబండల మండపం కింద ఉన్న స్వామివారి విగ్రహం రానురానూ పెరగడం విశేషం. స్వామి వారి కోసం తయారు చేసిన వెండి కవచం రానురానూ చిన్నదిగా మారడమే ఇందుకు నిదర్శనం. అప్పట్లో ఆకందగానిపల్లె, రామకుప్పం గ్రామస్తులు దాతల సహకారంతో ఆలయాన్ని పెద్దగా నిర్మించారు. 1997లో టీడీపీ ప్రభుత్వం సీజేఎఫ్ ద్వారా మంజూరు చేసిన రూ.7లక్షలతో నిర్వాహకులు ఆలయాన్ని పునర్నిర్మించారు. అంతేగాకుండా స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు ఆలయ ఆవరణలో శనీశ్వరస్వామి ఆలయాన్ని, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకులు పద్మావతి, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, వినాయకస్వామి ఆలయాలను నిర్మించారు. ఆలయం వెనుక నక్షత్ర, రాశీ, నవగ్రహ వనాలను సుందరంగా పెంచారు.

ఆలయ పునర్నిర్మాణానికి చంద్రబాబు హామీ

టీడీపీ అధినేత చంద్రబాబు గత ఎన్నికల ప్రచారంలో రామకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని రూ.2కోట్లతో పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవదాయ శాఖ స్థపతిలు ఇటీవల ఆలయాన్ని సందర్శించారు. ఆలయాన్ని ఎలా పునర్నిర్మించాలన్న విషయమై ఆలయ నిర్వాహకులు, స్థానిక టీడీపీ నాయకులతో సమాలోచనలు చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రేపు జాబ్ మేళా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుంగనూరులో ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఈ మేళాకు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, మోడ్రన్ వీర్ రేస్ సెక్యూరిటీ ఫోర్స్ సంస్థల ప్రతినిధులు హాజరై పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ డిప్లమో లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు తీసుకు రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9676180056ను సంప్రదించాలని కోరారు.

ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం
జాయింట్ సెక్రటరీగా జయచంద్ర కుమార్



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8: ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జయచంద్ర కుమార్‌ను నియమించినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు తెలిపారు. ఆదివారం జరిగిన సంఘ నూతన కార్యవర్గ ఎన్నికల్లో జయచంద్రకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి, ఫార్మసిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జయచంద్ర కుమార్ తెలిపారు.

గెరిగ ఉత్సవం ప్రారంభం



నగరి, సెప్టెంబరు 8 : నగరి గంగ జాతరను పురస్కరించుకుని ఆదివారం ఉదయం గెరిగ ఉత్సవాన్ని జాతర కమిటీ సభ్యులు ప్రారంభించారు. గంగమ్మకు అత్యంత ప్రీతివంతమైన ఈ ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మ గుడివద్ద ప్రారంభిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రతి పోలింగ్ బూత్‌లోనూ సభ్యత్వం ఉండాలి

చిత్తూరు (సెంట్రల్)/పాల సముద్రం, సెప్టెంబరు 8: జిల్లాలోని ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పార్టీ సభ్యత్వం ఉండేలా శ్రేణులు పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు తెలిపారు. ఆయన ఆదివారం చిత్తూరు, పాల సముద్రంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడమేగాక పార్టీ సభ్యత్వం చేయించాలన్నారు. సభ్యత్వ నమోదులో బూత్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 8: నగరంలోని తేనబండ హజరత్ సైదనా మహమ్మద్ జవహర్ అలిషా హుస్సేని ఖాదరి దర్గా ఉరుసు మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని బాబాకు ప్రార్థనలు చేశారు. మిట్టూరు కార్పొరేటర్ వసంత్‌కుమార్ నాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



కొబ్బరి మొక్క నాటుతున్న ఆశిష్ గుప్తా

తవణంపల్లె, సెప్టెంబరు 8: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం జాతీయ పట్టణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ మల్లెల శివప్రసాద్‌లు తనిఖీ చేశారు. మండలాభివృద్ధి కార్యాలయం వద్ద చేపట్టిన వర్షపు నీటి ఇంకుడు గుంతను, తవణంపల్లె సచివాలయ భవనాన్ని, కక్కులమిట్ట గ్రామంలో కొబ్బరి మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. జోగివారిపల్లె హౌసింగ్ కాలనీలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో లలిత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడిపాల, సెప్టెంబరు 8: మండలంలోని కమ్మతిమ్మాపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైదేహి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు లోకేష్, నానబాల, టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు హరిబాబు, నాయకులు రఘునాథనాయుడు, శేఖర్, సింధు, రమేష్ పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 8 :వినాయకుడి నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వినాయక గ్రామ కమిటీలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. చెరువుల వద్దకు పిల్లలు వెళ్లరాదని, ఊరేగింపు సందర్భంగా విద్యుత్ లైన్లు తగలకుండా చూడాలని సూచించారు. బాణసంచా పేల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. గొడవలు జరిగితే గ్రామ కమిటీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో పూర్వ విద్యార్థులు

ఐరాల, సెప్టెబరు 8: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చేద్దామని పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు వజ్రోత్సవాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం వజ్రోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఆదినారాయణరెడ్డి, గల్లా రామచంద్రనాయుడు, ప్రొఫెసర్ శషన్, కోమల, అధ్యక్ష, సలహాదారులుగా శ్రీనివాసులు, సీఎస్.ప్రసాద్‌రెడ్డి, స్థాపిత ఛైర్మన్ సీతాపతినాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా ఏవీ.రాజేష్‌రెడ్డి, కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కిషోర్‌లను ఎన్నుకున్నారు.

ట్రాక్టర్ నుంచి పడి యువకుడి మృతి



రంజిత్(ఫైల్ ఫొటో)

ఐరాల, సెప్టెంబరు 8: ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరసింహులు కథనం మేరకు.. ఐలవారిపల్లెకు చెందిన వెంకటాద్రి తన పొలానికి ట్రాక్టర్‌తో మట్టి తోలుతున్నారు. ట్రాక్టర్ యజమాని జయచంద్రారెడ్డితో కలిసి వెంకటాద్రి కుమారుడు రంజిత్(26) ఉన్నాడు. పొలంలో ట్రాక్టర్ మిట్ట ఎక్కే క్రమంలో ఒక్కసారిగా వెనక్కు వచ్చేసింది. ఇచ్చిపై నిలబడి ఉన్న రంజిత్ కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ మిక్సర్ లారీ బోల్తా
ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



బంటి మృతదేహం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 8: చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే బోడబండ్ల బ్రిడ్జి వద్ద ఆదివారం సిమెంట్ మిక్సర్ లారీ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బంటి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ కుమార్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. సిమెంట్ మిక్సర్ లోడుతో వస్తుండగా బోడబండ్ల సమీపంలోని బ్రిడ్జి వద్ద లారీ అదుపుతప్పి కింద పడటంతో క్లీనర్ బంటి (30) మృతి చెందగా, డ్రైవర్ నీరజకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విఘ్న వినాయక నమోనమః

- వాడవాడలా వేడుకగా చవితి ఉత్సవాలు
- ప్రశాంతంగా నిమజ్జనాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 8: నగరంలో శనివారం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. విగ్రహాలను ప్రతిష్ఠించి వేదపండితులు, పురోహితుల మంత్రోచ్చారణలతో పూజలు చేశారు. బజారు వీధిలోని శివషణ్ముగ సుందర వినాయకస్వామి ఆలయంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పూజలు చేయించారు. పర్యావరణ పరిరక్షణకు గాను జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ప్రతినిధులు పన్నీర్ సెల్వం ఆధ్వర్యంలో మూడు వందల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మార్కెట్ చౌక్‌లో కూరగాయలతో, సంతపేట సంతాన గణపతి, 75 దొడిపల్లె విశ్వరూప, మురకంబట్టు సిద్ధిబుద్ధి, గిరింపేట సిద్ధార్థనగర్ సుందర గణపతి, వన్నియార్ బ్లాక్‌లో సర్వాభరణ, మంగసముద్రంలో కాళీయమర్ధన వినాయకులను ఏర్పాటు చేశారు. దొడ్డిపల్లె జయచంద్ర కాలనీలో త్రిమూర్తులు, శిరస్సుపై శివగంగ బజారు వీధిలో దుర్గాదేవి అనుగ్రహ గణపతి, ప్రశాంత్‌నగర్‌లో పూల గణపతి, వళ్లియప్ప నగర్‌లో నాట్య గణపతి, దుర్గానగర్ కాలనీ సిద్ధగణపతి విగ్రహాలు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎమ్మెల్యే జగన్మోహన్ కట్టమంచి వినాయక నిమజ్జన ఘాట్‌ను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగరపాలక సంస్థ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు.

నేడు నిమజ్జనం

నగరంలో సోమవారం గణేశ నిమజ్జనం చేయనున్నారు. కట్టమంచి, గంగనేని, 75 దొడ్డిపల్లె చెరువులు, మంగసముద్రం, దుర్గానగర్‌కాలనీ, గంగాసాగరం ఘాట్లు, నీవానది, ఎన్టీఆర్ జలాశయాల్లో ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాల నిమజ్జనానికి క్రేన్‌లు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగరి : నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో వీధివీధినా వినాయక విగ్రహాలకు పూజలు చేశారు. ఒకటో వార్డులోని ధర్మాపురం, పాండురాజుపురం, మండపం, గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడ ప్రాంతాల్లో వినాయకచవితి వేడుకలకు మాజీ కౌన్సిలర్ లత విరాళాలు అందించారు.

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం, శ్రీబొమ్మరాజుపురం, మిక్సింకాపురం, వీర్లగుడి, మహాదేవపురం, తిరుమలరాజుపురం, శ్రీకావేరిరాజుపురం, ఆముదాల, బలిజకండ్రిగ, నర్సింహాపురం గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు, ఉభయదారులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయపురం : మండలంలోని పలు గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. శనివారం రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. పన్నూరు సబ్‌స్టేషన్, పాతార్కాడు, మహారాజపురం, కోసలనగరం, విజయపురంలో అన్నదానం చేశారు. మహారాజపురంతో పాటు పలు గ్రామాల్లో యువకుల కోలాహలం నడుమ వినాయకులను నిమజ్జనం చేశారు.

నింద్ర : మండలంలో వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పూతలపట్టు : మండల ప్రజలు చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం చేశారు. పూతలపట్టు పల్లెవీధిలో ఏర్పాటు చేసిన వినాయకస్వామి విగ్రహం వద్ద టీడీపీ నేత గుంటూరు మురళి, విజయం విద్యాసంస్థల ఛైర్మన్ తేజోమూర్తి నాయుడు పూజలు చేశారు.

గుడిపాల : మండలంలోని పానాటూరు, 197 రామాపురం, దాయంవారిపల్లి, చిత్తపార, బండపల్లి, చీలాపల్లి, ఏఎల్‌పురం, బసవాపల్లి, రెట్టగుంట తదితర గ్రామాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. కొత్తపల్లి, ముట్టుకూరుపల్లి గ్రామాల్లో ఆదివారం నిమజ్జనం చేశారు. అన్నదానం చేశారు.

పెనుమూరు : మండలంలో రకరకాల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల అన్నదానం చేశారు. పెనుమూరు, జట్టిగుండ్లపల్లి, తూరుపల్లి, సీఎస్ అగ్రహారం, కండ్రిగ, మఠంపల్లి గ్రామాల్లో పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో నిమజ్జనం చేయగా మరికొన్ని చోట్ల పూజలు చేస్తూనే ఉన్నారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని గ్రామాల్లో బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిండి వంటకాలను నైవేద్యంగా పెట్టారు. కొన్నిచోట్ల శనివారం రాత్రే స్వామిని ఊరేగించి, ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చారు.




చిత్తూరు దొడ్డిపల్లె జయచంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాలు




చిత్తూరు బజారువీధి శివషణ్ముగ సుందర వినాయక వాహన సేవలో ఎమ్మెల్యే జగన్మోహన్, సీకే బాబు - దుర్గాదేవి అలంకారంలో..




విజయపురం మండలం పాతార్కాడులో - పూతలపట్టు పల్లెవీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు




గుడిపాల మండలం ముట్టుకూరుపల్లిలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు - పెనుమూరు మండలం సీఎస్ అగ్రహారంలో వినాయకుడు





కార్వేటినగరం - వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె - నగరిలోని నగరిపేటలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

దోమల నుంచి కాపాడాలని నిరసన



వెదురుకుప్పం, సెప్టెంబరు 8: దోమల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నివారించాలని కార్వేటినగరం మండలం పద్మసరస్సు గ్రామ సమీపంలోని గొల్లఇండ్ల వాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో మురుగు నీటి కాలువల పనులు చేపట్టి మూతలు వేయడం మరిచారన్నారు. ఈ విషయమై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలను శుభ్రం చేయడం కూడా మరిచారని చెప్పారు. దోమలు వృద్ధి చెంది రాత్రిపగలు తేడా లేకుండా కుట్టిపడేస్తున్నాయని చెప్పారు. స్పందించి చర్యలు చేపట్టకపోతే జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాజీ ఎంపీటీసీ మృతి

వెదురుకుప్పం, సెప్టెంబరు 8: కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లి మాజీ ఎంపీటీసీ మణి(60) అనారోగ్యంతో మృతి చెందారని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. విషయం తెలుసుకున్న అఖిలపక్ష నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు.

వీల్‌చైర్ వితరణ

వెదురుకుప్పం, సెప్టెంబరు 8: కార్వేటినగరం మండలం గాజంకికి చెందిన చంద్రయ్య నడవలేని స్థితిలో ఉన్న పరిస్థితిని గుర్తించి జనసేన పార్టీ తరఫున వీల్‌చైర్ వితరణ చేశారు. పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ ఆదివారం దాన్ని అందించారు.

మట్టిని తవ్వేస్తున్నా..పట్టించుకోరా?



బంగారుపాళ్యం, సెప్టెంబరు 8: మండలంలోని బలిజపల్లి వద్ద గల కామాక్షమ్మ చెరువులో చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల గుత్తేదారులు యథేచ్ఛగా మట్టిని తవ్వేస్తున్నారు. చెరువులో సుమారు రెండుమీటర్ల లోతు మట్టి తీసి, పెద్దపెద్ద గోతులుగా చేసేస్తున్నారు. చెరువు కట్ట అంచునే మట్టిని తవ్వేయడంతో నీరువస్తే తెగే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. బోడబండ్ల, ఎద్దులవారిపల్లి, గుంతూరు, గౌరీశంకరాపురం, టేకుమంద చెరువుల్లో, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి తరలించుకుపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుప్పిగానిపల్లెలో నగల చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

గుడిపాల, సెప్టెంబరు 8: మండలంలోని కుప్పిగానిపల్లిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ రామ్మోహన్ కథనం మేరకు.. కుప్పిగానిపల్లెకు చెందిన రవి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి గ్రామంలో నిర్వహిస్తున్న వినాయకుడి పూజలకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువా పగులగొట్టి 26 సవర్ల బంగారు నగలు అపహరించారు. పూజల అనంతరం ఇంటికి చేరుకున్న రవి ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా 16 సవర్ల నగలు ఇంటి కాంపౌండు వద్ద పడిపోయి ఉండగా గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నామని ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 8: అనారోగ్యంతో మృతి చెందిన గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన టీడీపీ సీనియర్ నేత చిన్నబ్బకు ఎమ్మెల్యే థామస్ ఆదివారం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే గాంధీ, కృష్ణమనాయుడు, వెంకటేశ్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, రాంబాబురెడ్డి, యుగంధర్, కామసాని కోదండరెడ్డి, నరసింహులు నాయుడు, నాయజ్ అలి ఆయన వెంట ఉన్నారు.

వినాయక పూజలో ఎస్పీ



చిత్తూరు, సెప్టెంబరు 8: ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పూజలో ఆదివారం చిత్తూరు ఎస్పీ మణికంఠ, ఆయన కుటుంబ సభ్యులు, క్యాంపు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. గణపతి స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. పోలీసు సిబ్బందికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

అలరించిన భాగవత మధురిమలు



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 8: కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కాణిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు టి.శాంతాభాస్కర్ ఆస్థాన మండపంలో 'భాగవత మధురిమలు' అనే అంశంపై ప్రవచనం చేశారు. భాగవతం మన చెవుల ద్వారా ప్రవేశించి, హృదయంలో నిలిచినప్పుడు సంపూర్ణ కృష్ణప్రేమ లభిస్తుందన్నారు. పోతన భాగవతం నుంచి ఆమె ఆలపించిన పద్యాలకు భక్తులు తన్మయత్వం పొందారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు, సెప్టెంబరు 8: అనారోగ్యానికి తోడు మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో గిరింపేట శరవణపురానికి చెందిన శంకర్‌పిళ్లై(68) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చెన్నైలో చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం గాయత్రి చిల్డ్రన్స్‌పార్కులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

ఘనంగా వరసిద్ధుడి గ్రామోత్సవం



ఐరాల(కాణిపాకం)సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాత్రి కాణిపాకం పురవీధులలో ఘనంగా ఊరేగించారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఉంచి భాజాభజంత్రీలు వాయిస్తు, నృత్యాలు చేస్తు భక్తి పారవశంతో ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వందలాదిగా భక్తులు తరలి వచ్చారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని చవితి సందర్భంగా శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, జడ్పీటీసీ సుచిత్ర దర్శించుకున్నారు. వారికి ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లుకోదండపాణి, రంగస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

ఐరాల మండలం అడపగుండ్లపల్లెకు చెందిన దివంగత నేత మహదేవనాయుడు కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఆలయ ఉభయదారులుగా ఏటా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అనుబంధ ఆలయాలైన మణికంఠేశ్వర స్వామి, వరదరాజ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జడ్పీటీసీ సుచిత్ర, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఈవో గురుప్రసాద్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, మాజీ జడ్పీటీసీ లత, గంగారపు హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుష్పకావళ్ల సమర్పణ

వినాయక చవితిని పురస్కరించుకుని కాణిపాకానికి చెందిన కాణిపాక విఘ్నేశ్వర యువజన సంఘం వారు పుష్ప కావళ్లను సమర్పించారు. యువజన సంఘం యువకులు కావళ్లను కాణిపాకం పుర వీధులలో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చారు. ఏటా బ్రహ్మోత్సవాలలో తొలి వేడుకగా పుష్ప కావళ్లను నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. ప్రధాన ఆలయం వద్ద కావళ్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, తెచ్చిన భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.



వ్రతకల్పంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, తదితరులు



పుష్పకావళ్లు తీసుకొస్తున్న విఘ్నేశ్వర యువజన సంఘం వారు

